

అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న కార్పొరేటర్ కన్నె ఉమాదేవి

బాల్య వివాహాలను ప్రోత్సహించొద్దు: ఉమాదేవి

బర్కత్‌పుర, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : తల్లిదండ్రులు బాల్యవివాహాలను ప్రోత్సహించరాదని కాచిగూడ కార్పొరేటర్ కన్నె ఉమాదేవి అన్నారు. గురువారం కాచిగూడ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బాల్య వివాహ ముక్త భారత్ కార్యక్రమంలో భాగంగా అవగాహన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాల్య వివాహాలు నిరోధించడానికి పటిష్ఠమైన చట్టాలు అమలులోకి వచ్చాయన్నారు. బాలికలకు 18 ఏళ్ల నిండిన తర్వాత బాలురకు 21 ఏళ్ల నిండిన తర్వాత వివాహాలు జరపాలన్నారు. బాల్య వివాహ నిరోధక చట్టంపై పూర్తిస్థాయిలో అవగాహన పెంపొందించాలన్నారు. ఈ కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ ఎఎస్‌హెచ్‌వో హేమలత, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ చిరంజీవి, ప్రతినిధులు అపర్ణ, రఫియాభాను, విజయభాస్కర్, రాంరెడ్డి, పద్మ, పర్వతాలు, రఘు తదితరులుపాల్గొన్నారు.



త్యాగరాయగానసభలో మాట్లాడుతున్న డా.శ్రీధర్, పక్కన జనార్దనమూర్తి

ఎంఎస్ సుబ్బలక్ష్మి సంగీతసేవలు చిరస్మరణీయం

చిక్కడపల్లి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): భారతరత్న ఎంఎస్ సుబ్బలక్ష్మి సంగీత సేవలు చిరస్మరణీయమని రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ మాజీ చైర్మన్ డా.ఆయాచితం శ్రీధర్ అన్నారు. త్యాగరాయగానసభ ఆధ్వర్యంలో జరుగుతున్న ఎందరో మహానుభావుల కార్యక్రమ పరంపరలో భాగంగా గురువారం రాష్ట్ర భాషా, సాంస్కృతిక శాఖ సౌజన్యంతో కర్ణాటక సంగీత గాయకురాలు భారతరత్న ఎంఎస్ సుబ్బలక్ష్మి యాదిలో గానసభ అధ్యక్షుడు కళా జనార్దనమూర్తి అధ్యక్షతన కార్యక్రమం జరిగింది. శ్రీధర్ మాట్లాడుతూ, 1916లో మధురైలో జన్మించిన సుబ్బలక్ష్మి పదేళ్ల ప్రాయంనుంచే పాటలు పాడి సంగీత ప్రస్థానాన్ని ప్రారంభించారన్నారు. 1954లో పద్మభూషణ్, 1968లో సంగీత కళానిధి బిరుదు పొందిన తొలి మహిళగా ఆమె నిలిచారన్నారు. 1998లో దేశ అత్యున్నత పురస్కారం భారతరత్న లభించాయని వివరించారు. కార్యక్రమంలో విశ్వసాహితీ అధ్యక్షులు జయరాములు, సంఘసేవకులు పిఎస్ఆర్ మూర్తి, కళాపోషకులు వడ్లకొండ వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న తలసాని, ముఠా గోపాల్, ముఠా జైసింహ

కేసీఆర్ దీక్షా దినోత్సవం పోస్టర్ ఆవిష్కరణ


చిక్కడపల్లి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): నవంబరు 29 దీక్ష దినోత్సవాన్ని పురస్కరించుకుని బీఆర్ఎస్ యువనేత ముఠా జైసింహ రూపొందించిన దీక్ష దినోత్సవ పోస్టర్‌ను తెలంగాణ భవన్‌లో గురువారం మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్, ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్, ఎమ్మెల్సీ సురభి వాణీదేవి, మాజీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్ ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ తెలంగాణ ఆత్మగౌరవాన్ని ప్రతిబింబించే ఈ పోస్టర్ కేసీఆర్ ధైర్యం, త్యాగం, సంకల్పాన్ని మరువలేని సంఘటనగా మరోసారి ప్రజలకు గుర్తుచేసిందన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ బీఆర్ఎస్ నాయకులు, కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు, పార్టీ కార్యకర్తలుపాల్గొన్నారు.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అతిథులు

చమక్కులు- తళుక్కులు పుస్తకావిష్కరణ

చిక్కడపల్లి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఉత్తమ రచనలు సమాజాన్ని మంచిమార్గంలో నడిపిస్తాయని ప్రముఖ కవి, విద్యావేత్త డా. వై. రామకృష్ణారావు అన్నారు. శ్రీ మానస ఆర్ట్ థియేటర్స్ ఆధ్వర్యంలో గురువారం రాత్రి త్యాగరాయగానసభలో ప్రముఖ కవి తిరుమల వెంకటస్వామి (టివి స్వామి) రచించిన చమక్కులు- తళుక్కులు పుస్తకావిష్కరణ సభజరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొని పుస్తకాన్ని ఆవిష్కరించిన వై.రామకృష్ణారావు మాట్లాడుతూ టివి స్వామి విశిష్ట వ్యక్తిత్వం కలిగిన సాహితీమూర్తి అని ప్రశంసించారు. స్నేహభావంతో పుస్తకాన్ని ప్రముఖ కవి, కీర్తిపురస్కార గ్రహీత ఉమ్మడిశింగు రాఘవరావుకు అంకితం ఇచ్చి ప్రతిభను ప్రోత్సహిస్తున్నారన్నారు. కార్యక్రమంలో ప్రముఖులు రాంబబు, జనార్దనమూర్తి, గౌరీశంకర్, లలితవాణి, ప్రభాకర్, సుందరరామకృష్ణ, జయసూర్య, భవాని, రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.



గోల్నాక డివిజన్‌లో వందేమాతరం ఉత్సవాలలో పాల్గొన్న బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు ఆనంద్‌గౌడ్ తదితరులు

వందేమాతరం 150 ఏళ్ల ఉత్సవాలు

గోల్నాక, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): వందేమాతరం 150 సంవత్సరాల ఉత్సవాల సందర్భంగా బీజేపీ గోల్నాక డివిజన్ అధ్యక్షుడు సూదగాని శ్రీధర్‌గౌడ్ ఆధ్వర్యంలో డివిజన్‌లోని జైస్వాల్‌గార్డెన్ కాలనీలోగల లిటిల్‌ఫ్లవర్స్ హైస్కూల్‌లో ఉత్సవాలను నిర్వహించి వందేమాతరం గీతాన్ని ఆలపించారు. ఈ కార్యక్రమానికి బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు గంధమల్ల ఆనంద్‌గౌడ్, బీజేపీ సెంట్రల్ జిల్లా ఉపాధ్యక్షుడు, కార్యక్రమ ప్రభారి కన్నె రమేష్‌యాదవ్, పార్టీ జిల్లా కార్యాలయ కార్యదర్శి మూల రవీందర్‌గౌడ్, పార్టీ సీనియర్ నాయకులు పాఠశాల కరస్పాండెంట్ ఉపేందర్ పాల్గొని విద్యార్థులతో కలిసి వందేమాతరం గీతాన్ని ఆలపించారు.



ప్రత్యేక పూజలు

నల్లకుంట టీఆర్‌టీ కాలనీలో శ్రీదుర్గామాత ఆలయంలో అమ్మవారికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ దంపతులు, కార్పొరేటర్ యాకర అమృత

- నల్లకుంట, ఆంధ్రజ్యోతి

ఇళ్ల మధ్య వైన్‌షాపు వద్దు

బాపూజీనగర్‌లో బీజేపీ నాయకుల ధర్నా

ముషీరాబాద్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ముషీరాబాద్ డివిజన్‌లోని బాపూజీనగర్‌లో జనావాసాల మధ్య వైన్‌షాపు ఏర్పాటు చేయడాన్ని నిరసిస్తూ స్థానికులతో కలిసి బీజేపీ నాయకులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా గురువారం బీజేపీ ముషీరాబాద్ నియోజకవర్గం జాయింట్ కన్వీనర్ ఎం.నవీన్‌గౌడ్ స్థానికులు అమరేందర్‌యాదవ్ మాట్లాడుతూ ఇళ్ల మధ్య వైన్‌షాపు పెట్టవద్దని అన్నారు. వైన్‌షాపు ఏర్పాటుకు ఇప్పటికే షెడ్‌ను సహితం నిర్మించారని, బాపూజీనగర్ సమీపంలో ఇప్పటికే వైన్‌షాపు, కాంపౌండ్‌లు కొనసాగుతున్నాయని, వీటి వల్ల తాము తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. కొత్తగా మరో వైన్‌షాపు ఏర్పాటుకు అధికారులు అనుమతిస్తే స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటారని ఆందోళన వ్యక్తం చేశారు. స్థానికంగా ఆలయాలు, ఆస్పత్రులు ఉన్నాయని అధికారులు వైన్‌షాపు ఏర్పాటుకు అనుమతి ఇవ్వవద్దని డిమాండ్ చేశారు. ఏర్పాటు చేసిన షెడ్ తొలగించాలని జీహెచ్‌ఎంసీ టౌన్‌ప్లానింగ్ అధికారులకు స్థానికులు ఫిర్యాదు చేశారు. ఈ ధర్నాలో ముషీరాబాద్ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు కంచి ముదిరాజ్, నాయకులు తుమ్మ శ్రీనివాస్, ఆర్.ఎల్.రమేష్, రాజు, ఖాన్, హరీష్, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



బాపూజీనగర్‌లో ధర్నా చేస్తున్న బీజేపీ ముషీరాబాద్ నియోజకవర్గం జాయింట్ కన్వీనర్ ఎం.నవీన్‌గౌడ్, తుమ్మశీను, అమరేందర్

అనుమతి ఇవ్వలేదు

బాపూజీనగర్‌లో కొత్తగా వైన్‌షాపు ఏర్పాటుకు ఎవరికి ఇప్పటి వరకు అనుమతులు ఇవ్వలేదు. తమకు దరఖాస్తు కూడా చేసుకోలేదు. ఈ సమస్య తమ దృష్టికి రాలేదు.

- ముషీరాబాద్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ

ప్రతిపౌరుడికీ రాజ్యాంగంపై అవగాహన ఉండాలి

యువత రాజ్యాంగ విలువలను ఆచరిస్తేనే దేశం బలపడుతుంది - ఎంపీ వంశీ కృష్ణ

రాంనగర్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ప్రతిపౌరుడు రాజ్యాంగంపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని, యువత రాజ్యాంగ విలువలను ఆచరిస్తేనే దేశం బలపడుతుందని ఎంపీ వంశీ కృష్ణ అన్నారు. ప్రజాస్వామ్య బలం, పారదర్శక పాలన, సంక్షేమ విధానాలకు రాజ్యాంగ జ్ఞానం కీలకం అన్నారు. ప్రగతిశీల వాదంలో రాజ్యాంగ రచన, ప్రియాంబుల్, మౌలిక హక్కులు పునాదుల వంటివన్నారు. గురువారం బాగ్‌లింగంపల్లిలోని డాక్టర్ బీ.ఆర్.అంబేద్కర్ లా కాలేజీలో సంవిధాన దినోత్సవ వేడుకలు జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై ఆయన మాట్లాడుతూ అంబేద్కర్ చూపించిన న్యాయం, సమానత్వం, సౌహార్దం దేశ పురోగతికి మార్గదర్శకం అన్నారు. ఆర్టికల్ 21 విద్య గౌరవం, ప్రైవసీ, పర్యావరణం వంటి హక్కులను కల్పించిందన్నారు. ఈ సందర్భంగా ఓరల్ ప్రజెంటేషన్ అవార్డులు పబ్లిక్ ఇంటరెస్ట్ లిటిగేషన్ పోటీలో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులను ఎంపీ వంశీకృష్ణ ప్రదానం చేశారు. అదే విధంగా విద్వతా లా ఫెస్ట్‌లో పాల్గొన్న విద్యార్థులకు ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ విద్యా సంస్థల సీఈవో ప్రొఫెసర్ లింబాద్రీ, జాయింట్ సెక్రటరీ పి.వి.రమణ, నాల్సార్ వైస్ ఛాన్స్‌లర్ ప్రొఫెసర్ శ్రీకృష్ణదేవరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ డి.సృజన, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న ఎంపీ వంశీ కృష్ణ తదితరులు

డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం

ఎమ్మెల్యే ముఠా గోపాల్

ముషీరాబాద్, నవంబర్ 27 (ఆంధ్రజ్యోతి): ముషీరాబాద్ లోని వినోభానగర్‌లో డ్రైనేజీ సమస్య శాశ్వత పరిష్కారానికి ఈ కొత్తపైపులైన్‌ను వేస్తున్నామని ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. గురువారం ముషీరాబాద్ డివిజన్‌లోని వినోభానగర్‌లో రూ. 6.50లక్షల వ్యయంతో నూతనంగా చేపట్టిన డ్రైనేజీ పైపులైన్ నిర్మాణం పనులను ఎమ్మెల్యే ముఠా గోపాల్ డివిజన్ కార్పొరేటర్ సుప్రియ నవీన్‌గౌడ్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దశాబ్ద కాలంగా వినోభానగర్‌లో డ్రైనేజీ సమస్యతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. పెరిగిన జనాభాకు అనుగుణంగా డ్రైనేజీ వ్యవస్థను ఆధునీకరిస్తున్నామన్నారు. వారం రోజులలో పనులు పూర్తి చేసి డ్రైనేజీ సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్పొరేటర్ సుప్రియ నవీన్‌గౌడ్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కార్పొరేటర్లకు రూ.2 కోట్ల నిధులు కేటాయించడం అభినందనీయమన్నారు. నగర ఇన్‌చార్జి మంత్రి మరో కోటి రూపాయలు కేటాయించడం వల్ల డివిజన్‌లో సమస్యలు పరిష్కారమవుతాయని పేర్కొన్నారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు కార్పొరేటర్లను పట్టించుకోలేదని ఆమె ఆరోపించారు. కార్యక్రమంలో బీజేపీ ముషీరాబాద్ నియోజకవర్గం జాయింట్ కన్వీనర్ నవీన్‌గౌడ్, డివిజన్ అధ్యక్షుడు కంచి ముదిరాజ్, ముషీరాబాద్ బీఆర్ఎస్ అధ్యక్ష, కార్యదర్శులు శ్రీధర్‌రెడ్డి, ఆకుల అరుణ్‌కుమార్, పార్టీ సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



వినోభానగర్‌లో డ్రైనేజీ పైప్‌లైన్ పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే ముఠాగోపాల్, కార్పొరేటర్ సుప్రియ నవీన్‌గౌడ్



ఎమ్మెల్యే నవీన్‌యాదవ్‌ను బోకేతో సత్కరిస్తున్న టీపీసీసీ ఉపాధ్యక్షుడు నవాబ్ ముజాహిద్ ఆలంఖాన్

అభివృద్ధి కార్యక్రమాలే నవీన్‌ను గెలిపించాయి

టీపీసీసీ ఉపాధ్యక్షుడు నవాబ్ ముజాహిద్ ఆలంఖాన్

బర్కత్‌పుర, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలే ఉప ఎన్నికలో జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో నవీన్‌యాదవ్‌ను భారీ మెజారిటీతో గెలిపించాయని టీపీసీసీ ఉపాధ్యక్షుడు నవాబ్ ముజాహిద్ ఆలంఖాన్ తెలిపారు. గురువారం గాంధీభవన్‌లో ఎమ్మెల్యే నవీన్‌యాదవ్‌కు పూలబోకే శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలకు ప్రజలు సరైన గుణపాఠం చెప్పారని, జీహెచ్‌ఎంసీ ఎన్నికల్లో గ్రేటర్‌పై కాంగ్రెస్ జెండా ఎగిరితీరుతుందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి చేపట్టిన సంక్షేమ కార్యక్రమాల పట్ల ప్రజలు సంతృప్తిగా ఉన్నారని, ఇది జీర్ణించుకోలేని బీజేపీ. బీఆర్ఎస్ పార్టీలు లేనిపోని విమర్శలు చేస్తున్నాయని, ఆ పార్టీలకు ప్రజలే గుణపాఠం చెబుతారని అన్నారు.

అలరించిన సంగీత కచేరీ

నల్లకుంట, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): శ్రీభద్రపీఠం ఆధ్వర్యంలో రాణా తూము లక్ష్మీనరసింహదాసు 192వ ఆరాధన సంగీత మహోత్సవంలో భాగంగా గురువారం నగరంలోని గుడిమల్కాపురంలోని శ్రీషిరిడీసాయిబాబా ఆలయంలో భక్తిసంగీత కచేరీ నిర్వహించారు. శ్రీ భద్రపీఠం వ్యవస్థాపక అధ్యక్షుడు తూము వెంకట రామకృష్ణ జ్యోతిప్రజల్వనతో ఈ కార్యక్రమం ప్రారంభమైంది. సంగీత విద్వాంసులు జ్యోతిర్‌లత, పద్మవల్లి, ధృతి, చిన్నారి అరుష్ బృందం ఆలపించిన వాగ్గేయకారుల కీర్తనలు సంగీతాభిమానులను ఆలరించాయి. ఈ భక్తి సంగీత కచేరీకి తబలాపై కేసీహెచ్.నటరాజ్, కీబోర్డుపై ఎస్.వి.ఆర్.శాస్త్రి వాద్యసహకారం అందించారు.

29న అయ్యప్ప స్వామి మహాపడిపూజ

నల్లకుంట, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): నల్లకుంట డివిజన్ బ్రాహ్మణ హాస్టల్ వీధిలోని కొంతం గోవర్ధన్‌రెడ్డి గురుస్వామి 18వ అయ్యప్ప స్వామి మహాపడిపూజ కార్యక్రమం ఈ నెల 29న నిర్వహించనున్నట్లు నిర్వాహకులు కొంతం గోపాల్‌రెడ్డి వెల్లడించారు.

అంగన్‌వాడి టీచర్స్ నూతన కమిటీ ఎన్నిక

చిక్కడపల్లి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ అంగన్‌వాడి టీచర్స్ హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) నూతన రాష్ట్ర కమిటీని ఎన్నుకున్నారు. రాష్ట్ర 5వ మహాసభలు ఇటీవల ఆదిలాబాద్ జిల్లాలో జరిగిన సందర్భంగా అధ్యక్షురాలు కె.సునీత, కార్యదర్శి పిజె లక్ష్మి, కోశాధికారిగా మంగ, వర్కింగ్ అధ్యక్షులుగా ఎం. పద్మశ్రీ, ఉపాధ్యక్షులుగా వెంకటమ్మ, స్వప్న, ఏమెలమ్మ, రజితలతోపాటు 50 మందితో నూతన కమిటీ ఏర్పాటైందని కార్యదర్శి లక్ష్మి తెలిపారు.

భక్తిగీతాలు.. ఒత్తిడిని దూరం చేస్తాయి

చిక్కడపల్లి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): సినిమా, భక్తిగీతాలు మానసిక ఒత్తిడిని దూరం చేస్తాయని ప్రముఖ సంఘసేవకుడు విజయరామారావు అన్నారు. బృందావనం సంస్థ ఆధ్వర్యంలో త్యాగరాయగానసభలో 'హాయి హాయిగా ఆమని సాగే' పేరిట చిత్రగీతాల ఆలాపన జరిగింది. ఈ సందర్భంగా గాయనీగాయకులను విజయరామారావు అభినందించారు. వై. సుబ్రహ్మణ్యం, వైఎస్ రామకృష్ణ డా. శంకర్, నూకల ప్రభాకర్, హేమమాలిని, జ్యోతిర్లత, జ్యోతిర్మయి, శారదారాజులు గీతాలను ఆలపించి శ్రోతలను ఆకట్టుకున్నారు.

కంటిని నిర్లక్ష్యం చేస్తే జీవితమే అంధకారం

నల్లకుంట, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరు కంటిపై నిర్లక్ష్యం వహిస్తే జీవితం అంధకారమవుతుందని, ఏ మాత్రం అశ్రద్ధ వహించరాదని లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ డిస్ట్రిక్ట్ పూర్వ గవర్నర్ ఎన్.ఎస్.మూర్తి అన్నారు. బాగ్‌అంబర్‌పేటలోని శ్రీషిరిడీ సాయిబాబా సంస్థాన్ సౌజన్యంతో ఆలయంలోని ధ్యానమందిరంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో సుమారు 150 మందికి కంటి పరీక్షలు నిర్వహించి, ఉచితంగా కళ్ల అద్దాలు పంపిణీ చేశారు.

బోనం వీరబాబుకు పితృవియోగం

అంబర్‌పేట, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): అంబర్‌పేటకు చెందిన ప్రముఖ సంఘసేవకుడు బోనం వీరబాబుకు పితృవియోగం జరిగింది. ఆయన తండ్రి బోనం సత్యనారాయణ (85) గత కొద్దికాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఈ నెల 26న బాగ్‌అంబర్‌పేట మల్లికార్జుననగర్‌లోని వారి నివాసంలో ఆయన తండ్రి మృతి చెందాడు. ఆయన మృతి పట్ల ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ బోనం వీరబాబు కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

అశోక్‌నగర్ చౌరస్తాలో యథావిధిగా రాకపోకలు

చిక్కడపల్లి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): అశోక్‌నగర్ చౌరస్తాలో ఇటీవల భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ శిథిలావస్థకి చేరి రోడ్డు కుంగిపోయిన క్రమంలో గాంధీనగర్ వాటర్‌బోర్డ్ సిబ్బంది మరమ్మతులు పూర్తి చేశారు. నూతన డ్రైనేజీ లైన్ ఏర్పాటు చేసి మట్టి నింపారు. అనంతరం జీహెచ్‌ఎంసీ ఇంజనీరింగ్ సెక్షన్‌వారు యథావిధిగా రోడ్డు బాగు చేశారు. చిక్కడపల్లి ట్రాఫిక్ పోలీసులు బారికేడ్లు తొలగించి రాకపోకలను పునరుద్ధరించారు.

బోయపల్లి లింగంగౌడ్‌కు ఘన నివాళులు

గోల్నాక, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నేత బోయపల్లి లింగంగౌడ్ అకాల మృతి పార్టీకి తీరని లోటని, ఆయన మరణాన్ని జీర్ణించికోలేకపోతున్నామని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అన్నారు. గురువారం అలీకేఫ్ చౌరస్తాలోని ఫంక్షన్‌హాల్‌లో లింగంగౌడ్ దశ దిన కార్యక్రమంలో ఎమ్మెల్యే వెంకటేష్, మాజీ కార్పొరేటర్ కాలేరు పద్మావెంకటేష్ బీఆర్ఎస్ పార్టీ, ఇతర పార్టీల నాయకులు పాల్గొని లింగంగౌడ్ చిత్ర పటానికి నివాళులు అర్పించారు.

'ఫిలిం అందక' పోస్టర్ రిలీజ్

చిక్కడపల్లి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): సామాజిక నేపథ్యంలో తీసిన 'ఫిలిం అందక' పోస్టర్ రిలీజ్ కార్యక్రమాన్ని గురువారం చిక్కడపల్లి సిటీసెంట్రల్ లైబ్రరీలో విద్యార్థి సంఘం నేతలు నిర్వహించారు. ఈ సినిమాకు రచన, దర్శకత్వ బాధ్యతలు చేపట్టిన దేవరాజ్ పెద్దింటి సినిమా కథకు రూపకల్పన చేశారని నిరుద్యోగ విద్యార్థి సంఘం నేత సలీమ్ వివరించారు. సినిమా 28వ తేదీన విడుదలవుతుందని తెలిపారు.



లోయర్ ట్యాంక్‌బండ్ అంబేద్కర్ విగ్రహం వద్ద ధర్నా చేస్తున్న జనార్దన్, జస్టిస్ చంద్రకుమార్ తదితరులు

కేంద్రం బీసీ రిజర్వేషన్లు ప్రకటించాలి: జనార్దన్

కవాడిగూడ, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): బీపీ మండల్ కమిషన్ రికమండేషన్స్ ఆధారంగా కేంద్ర ప్రభుత్వం బీసీ రిజర్వేషన్లు ప్రకటించాలని బీసీ డెమొక్రటిక్ జేఏసీ కన్వీనర్ జనార్దన్ డిమాండ్ చేశారు. బీసీ ఎస్సీ ఎస్టీ మైనార్టీ మహిళలకు జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు కల్పించాలన్నారు. ఈ న్యాయమైన డిమాండ్లను కేంద్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలంటూ లోయర్ ట్యాంక్‌బండ్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్ద బీసీ డెమొక్రటిక్ జేఏసీ కన్వీనర్ జనార్దన్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో జస్టిస్ చంద్రకుమార్, బత్తుల సిద్దేశ్వర్, వివిధ ప్రజా సంఘాల నేతలు పాల్గొని నిరసన వ్యక్తం చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ జనాభా దామాషా ప్రకారం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు బీసీ ఎస్సీ ఎస్టీ మైనార్టీ మహిళలకు బడ్జెట్ కేటాయించాలని వారు డిమాండ్ చేశారు. మహిళా బిల్లులో కేటాయించిన 33శాతం రిజర్వేషన్లు 50శాతానికి పెంచి బీసీల జనాభా దామాషా ప్రకారం సబ్‌కోటా కేటాయించాలని వారు డిమాండ్ చేశారు. న్యాయమైన డిమాండ్ల సాధన కోసం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలపై పోరాటం చేస్తామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీసీ ప్రజాస్వామ్య జేఏసీ నేతలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో మాట్లాడుతున్న నేషనల్ కో-ఆర్డినేషన్ కమిటీ పెన్షనర్స్ అసోసియేషన్స్ అధ్యక్షుడు శ్రీధర్ తదితరులు

పెన్షనర్ల 'ఆరోగ్య' బాధ్యత ప్రభుత్వానిదే : శ్రీధర్

రాంనగర్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): పెన్షనర్లందరికీ ప్రభుత్వమే ఆరోగ్య సంరక్షణ బాధ్యతను నిర్వహించాలని నేషనల్ కో-ఆర్డినేషన్ కమిటీ పెన్షనర్స్ అసోసియేషన్స్ (ఎన్‌సీసీపీఏ) అధ్యక్షుడు శ్రీధర్ అన్నారు. గురువారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 8వ వేతన సవరణ కమిషన్‌కు సూచించిన నిబంధనల నుంచి అభ్యంతరకరమైన, తప్పుదారి పట్టించే పదజాలాన్ని ఉపసంహరించుకోవాలన్నారు. వేతన సవరణ కమిషనత్‌తో జరిగే వేతనం, పెన్షన్ సవరణకు సంబంధించిన అన్ని చర్చల్లో పెన్షనర్లను చేర్చాలన్నారు. కార్యక్రమంలో తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నారాయణరెడ్డి, పాలకుర్తి కృష్ణమూర్తి, ఎం.ఎస్.రెడ్డి, సోమయ్య తదితరులు పాల్గొన్నారు.



కాంగ్రెస్ పార్టీ ఖైరతాబాద్ జిల్లా నూతన అధ్యక్షుడు మోతే రోహిత్ ముదిరాజ్‌ను సత్కరించిన కె.అనిల్‌కుమార్ తదితరులు

అంకితభావంతో పనిచేసిన వారికి పదవులు : రోహిత్

నల్లకుంట, నవంబరు 27 : (ఆంధ్రజ్యోతి) : పార్టీ పటిష్ఠత కోసం అంకితభావంతో పనిచేసే కార్యకర్తలకు పదవులు కల్పించేందుకు అధిష్ఠానం చర్యలు తీసుకుంటుందని కాంగ్రెస్ పార్టీ ఖైరతాబాద్ జిల్లా అధ్యక్షుడు మోతే రోహిత్ ముదిరాజ్ అన్నారు. పార్టీ బలోపేతం కోసం తాను అందించిన సేవలను గుర్తించి తనకు జిల్లా అధ్యక్ష పదవి కల్పించడం ఇందుకు నిదర్శనం అన్నారు. తిలక్‌నగర్ బస్తీ కమిటీ అధ్యక్షుడు కె.అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు గురువారం నల్లకుంట డివిజన్ టీఆర్‌టీ క్వార్టర్స్‌లో మోతే రోహిత్ ముదిరాజ్‌ను ఆయన నివాసంలో కలిసి శాలువాకప్పి సత్కరించారు.

'ప్రభుత్వ విధానాలు.. మహిళల గౌరవానికే మచ్చ'



మాట్లాడుతున్న వంగల రాగసుధ

రాంనగర్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మహిళల హక్కులు, గౌరవాలను పక్కన పెట్టి వివక్షను అధికారిక విధానంగా మార్చిందని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సమైక్య (ఏఐఎఫ్‌డీబ్ల్యూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వంగల రాగసుధ ఆరోపించారు. మహిళలను రెండు వర్గాలుగా విభజించి పాలిస్తుందని విమర్శించారు. గురువారం బాగ్‌లింగంపల్లిలోని ఓంకార్ భవన్‌లో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. మహిళా శక్తి పథకం కింద వడ్డీ లేని రుణాలు, ఇందిరమ్మ చీరల పంపిణీలో ప్రభుత్వం అన్యాయం చేస్తుందని ధ్వజమెత్తారు.

కార్మిక చట్టాల రద్దుతో తీరని అన్యాయం: సీఐటీయూ

రాంనగర్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం 29 కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్‌లు తీసుకువచ్చి కార్మికులకు తీవ్ర అన్యాయం చేస్తుందని సీఐటీయూ హైదరాబాద్ సెంట్రల్ సిటీ కార్యదర్శి జె.కుమారస్వామి ఆరోపించారు. లేబర్ కోడ్‌ల వల్ల కార్మికులు యజమానులకు బానిసలుగా మారే పరిస్థితి దాపురించిందన్నారు. గురువారం గోల్కొండ చౌరస్తాలోని కార్యాలయంలో సీఐటీయూ తెలంగాణ రాష్ట్ర 5వ మహాసభలను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ఫిక్స్ టర్మ్ ఎంప్లాయిమెంట్ పేరుతో కార్మికులకు ఉద్యోగ భద్రత లేకుండా చేస్తుందని ఆరోపించారు. ఈ మేరకు సీఐటీయూ రాష్ట్ర మహాసభలు మెదక్ పట్టణంలో డిసెంబర్ 7, 8, 9వ తేదీలలో నిర్వహిస్తున్నామని, కార్మికవర్గం జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు ఎం.వెంకటేష్, ఎం.దశరథ్, జి.రాములు, జి.నరేష్, టి.యాదమ్మ తదితరులు పాల్గొన్నారు.

కోమటిరెడ్డిని మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేయాలి

రాష్ట్ర పద్మశాలి సంఘం అధ్యక్షుడు వల్లకటి రాజ్‌కుమార్

ముషీరాబాద్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): పద్మశాలి కులస్థులను అవమానించిన రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డిని మంత్రి పదవి నుంచి తొలగించాలని రాష్ట్రపద్మశాలి సంఘం అధ్యక్షుడు వల్లకటి రాజ్‌కుమార్ అన్నారు. నల్లగొండ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా నియమితులైన పున్న కైలాష్‌నేతను పదవి నుంచి తొలగించాలని కోమటిరెడ్డి వెంకటరెడ్డి డిమాండ్ చేసినందుకు నిరసనగా గురువారం ట్యాంక్‌బండ్ వద్ద గల కొండా లక్ష్మణ్‌బాపూజీ విగ్రహం వద్ద రాష్ట్ర పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన రాజ్‌కుమార్ మాట్లాడుతూ, కైలాష్‌నేతను డీసీసీ అధ్యక్ష పదవి నుంచి తొలగించాలని మంత్రి సీఎం రేవంత్‌రెడ్డికి ఫిర్యాదు చేయడం ఎంతవరకు సమంజసమని ఆయన ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ కోసం ఎంతో కృషి చేసిన కైలాష్‌నేత పై రాజకీయంగా కక్షకట్టి డీసీసీ పదవి నుంచి తొలగించేందుకు కుట్ర చేస్తున్నారని ఆయన ఆరోపించారు. బీసీలను రాజకీయంగా ఎదగనీయకుండా అడ్డుతగులుతున్నారని విమర్శించారు. డబ్బు అహంకారంతో కోమటిరెడ్డి వెంకటరెడ్డి బీసీలను అణగదొక్కేందుకు కుట్రలు చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. ఆయన వెంటనే పద్మశాలి కులస్థులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కైలాష్‌నేత నల్లగొండ డీసీసీ పదవిలో కొనసాగే విధంగా సహకారం అందించాలని కోరారు. లేని పక్షంలో రాబోయే ఎన్నికల్లో పద్మశాలిలంతా ఏకతాటిపైకి వచ్చి కోమటిరెడ్డి వెంకటరెడ్డికి తగిన గుణపాఠం చెపుతామని ఆయన హెచ్చరించారు. కులస్థులను అవమానించినందుకు నిరసనగా రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లా, మండల కేంద్రాల్లో ధర్నా, నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి పద్మశాలి కులస్థులకు అండగా ఉండి కైలాష్‌నేత జిల్లా అధ్యక్ష పదవిలో కొనసాగే విధంగా సహకరించాలని ఆయన విజ్ఞప్తిచేశారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర పద్మశాలి సంఘం కార్యదర్శి శ్రీనివాసరావు, కోశాధికారి బింగి నవీన్, ఉపాధ్యక్షులు వెంకటేశ్వర్లు, ఆల్‌ఇండియా వీవర్స్ ఫెడరేషన్ అధ్యక్షుడు రాజేశం, తదితరులు పాల్గొన్నారు.